క్లుప్తంగా

నేడు రీ సర్వేపై ర్యాలీ

రంగంపేట: జి.దొంతమూరులో ఆదివారం భూమి రీసర్వేపై ర్యాలీ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వీరసాయిబాబు, మండల విస్తరణ అధికారి పి.వెంకటరత్నం తెలిపారు. ఈ ర్యాలీకి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉదయం 8.30 గంటలకు జి.దొంతమూరు సచివాలయానికి రావాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మాఘమాసం మూడో శనివారం సందర్భంగా సంపరలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున పంచామృత, సప్త సాగర జలాలు, ప్రయాగ కుంభమేళా జలాలతో అభిషేకాలు ఘనంగా జరిగాయి. అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసీ దళాలతో, అమ్మవారికి శ్రీ చూర్ణంతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు సామూహిక గోవింద నామ పారాయణ చేశారు.

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మాఘమాసం శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా వెంకన్నబాబు తీర్థం

పెదపూడి: ఏపీ(త్రయం గ్రామంలో వెంకన్నబాబు తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు కరకుదురు, దోమాడ, రామేశ్వరం పరిసర గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా మాఘమాసంలోని మూడో శనివారం వెంకన్న తీర్థం నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. కాగా.. తీర్థం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సాయిబాబా మాలధారుల భిక్షాటన



బలభద్రపురంలో భిక్షాటన చేస్తున్న సాయిబాబా మాల ధరించిన భక్తులు

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డి సాయి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నారు. దీన్ని పురస్కరించుకుని చేసిన భిక్షాటన ద్వారా రూ.1,02,000, అలాగే 10.24 క్వింటాళ్ల బియ్యం వచ్చాయని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ సాయిబాబా భిక్షాటన చేసి పాపాలను తొలగించేవారని, ఆ సంప్రదాయంలో భాగంగా బాబా మాల ధరించిన భక్తులు మూడు రోజులు పాటు గ్రామంలో భిక్షాటన చేశారన్నారు. ఇలా సేకరించిన బియ్యం, నగదును వార్షికోత్సవం రోజు నిర్వహించే మహాన్నసమారాధనలో వినియోగిస్తారన్నారు. 17వ తేదీన ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

ఏఐతో వైద్యరంగంలో పెను మార్పులు



మాట్లాడుతున్న విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య

రాజానగరం: వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), జీనోమ్ పేపింగ్‌లు రాబోయే కాలంలో పెనుమార్పులు తీసుకువస్తాయని విజ్ఞాన్ యూనివర్సిటీ (గుంటూరు) చాన్సలర్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో శనివారం జరిగిన 17వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ రత్తయ్య మాట్లాడుతూ వ్యాధులను సులువుగా గుర్తించడానికి ఆధార్ వంటి గుర్తింపు కార్డులపై ఆయా వ్యక్తుల జీన్స్‌ని నమోదు చేసే పరిస్థితి వస్తోందన్నారు. వైద్య విద్యార్థులు, వైద్యులు కూడా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం తప్పదన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన మాజీ ప్రొఫెసర్, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ మల్లా భాస్కరరావు, జీఎస్ఎస్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్పీ మూర్తి పాల్గొన్నారు.

వేసవి వచ్చేసిందా..



ఎండ కారణంగా సీతానగరంలోని బస్టాండ్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం కనిపించని జనం



నిర్మానుష్యంగా మారిన సీతానగరంలోని నాలుగు బొమ్మల సెంటర్

- వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఫిబ్రవరిలోనే ఎండలు
- ప్రజలకు తప్పని అవస్థలు

సీతానగరం: వేసవి రాకుండానే సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. సాధారణంగా మహాశివరాత్రి తర్వాత చలి తగ్గి, వేడి పెరుగుతుందని పెద్దలు చెబుతారు. కానీ ఈ ఏడాది రథసప్తమి నాటి నుంచే ఎండ పెరుగుతూ వచ్చింది. ఫిబ్రవరి మధ్యలోనే భానుడు విజృంభిస్తున్నాడు. రోజురోజుకూ ఎండ ఎక్కువవుతోంది. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా భూమి వేడెక్కుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పెరిగిన ఎండ

ఏదిఏమైనా భానుడు ముందుగానే డ్యూటీలో చేరిపోయి నిప్పులు కురిపిస్తున్నాడు. సడన్‌గా సమ్మర్ అన్నట్టుగా వేసవి ముందుగానే వచ్చేసింది. చలి క్రమంగా తగ్గుతోంది. సీజన్ మారిపోతోంది. తెల్లవారుజామున చలి తీవ్రత కనిపిస్తున్నా, దాని ప్రభావం ఉదయం 8 గంటల వరకు మాత్రమే ఉంటోంది. అనంతరం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి.

గతేడాది తారెత్తించిన భానుడు

గతేడాది వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు 50 డిగ్రీల వరకూ చేరుకున్నాయి. ఈ వేసవిలోనూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉంటాయని శాస్త్రవేత్తలు అంచగా వేస్తున్నారు. 2023లో ఆరు నెలల సాధారణం కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయి. 2024లో అయితే సాధారణంగా కన్నా ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాదిలో ఫిబ్రవరిలో 35 డిగ్రీలకు చేరువయ్యాయి. రెండు రోజులుగా ఉక్కపోత మొదలైంది. సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి.

శీతల పానీయాలకు గిరాకీ

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో శీతల పానీయాలకు గిరాకీ పెరుగుతోంది. కూల్ డ్రింక్ లు, చెరుకు రసాలు, జ్యూస్‌లతో పాటు పుచ్చకాయలు, బొప్పాయి పండ్లను ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇక ఐస్‌క్రీమ్ పార్లర్ల వద్ద పిల్లల సందడి ఎక్కువగా కనిపిస్తోంది. రహదారుల పక్కనే వీటిని విక్రయించే దుకాణాలు బాగా పెరిగాయి.

జనవరి నుంచే..

ఈ ఏడాది జనవరి చివరి వారం నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. 30 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఉదయం వరకు మంచు కమ్మేసినా, 9 గంటల తర్వాత భానుడి ప్రతాపం పెరుగుతూ వచ్చింది. ఫిబ్రవరి నాటికి ఎండలు మొదలైపోయాయి. దాదాపు 35 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ఎండలు మండుతున్నాయి



సాధారణంగా ఫిబ్రవరిలో వాతావరణం చలిగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది ఎండలు పెరిగిపోయాయి. రాత్రి సమయంలో కొంచెం చలిగా ఉన్నా, ఉదయం 9 నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నాం.

– మట్టా శ్రీనివాస్, నాగరత్నం కాలనీ, సింగవరం

జాగ్రత్తలు పాటించాలి



ఫిబ్రవరిలోనే ఎండ ముదిరిపోవడంతో ప్రజలు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. మార్చిలో 45 నుంచి 50 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉంటాయని సమాచారం. ఈ నేపథ్యంలో మాంసాహారం, జంక్ ఫుడ్ తగ్గించాలి. కాచిన నీరు మాత్రమే తీసుకోవాలి. నిల్వ లేని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ ఏవీకే చైతన్య, సీతానగరం పీహెచ్‌సీ వైద్యుడు,

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



రాజానగరంలో ప్రతిష్ఠించిన వాసవీమాత విగ్రహం



చక్రద్వారబంధంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

రాజానగరం: మండలంలోని రాజానగరం, చక్రద్వారబంధంలలో నూతనంగా నిర్మించిన ఆలయాలలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక రావుల చెరువు గట్టున ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం 11.30 గంటలకు మహాగణపతి సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఆర్యవైశ్య ప్రముఖుల సమక్షంలో శాస్త్రోక్తంగా జరిగాయి.

- చక్రద్వారబంధంలో నిర్మించిన ఆలయంలో ఉదయం 10.54 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. జయ, విజయ, గరుడ అళ్వార్, విష్వక్సేనుడు, వరాహ స్వామి విగ్రహాలు, శిఖర, యంత్రరాజ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు జరిగాయి.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: స్థానిక పాలచర్ల బ్రహ్మాజీ వీధిలోని నంది విగ్రహం వద్ద 18 అడుగుల ఎత్తయిన అభయ ఆంజనేయస్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకుడు పి.కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామం

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం గోవింద నామ స్మరణతో మార్మోగింది. మాఘమాసం మూడో శనివారం కావడంతో విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అభిషకార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వచ్ఛాంధ్రతో పరిసరాల పరిశుభ్రం



సీతానగరం పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సీతానగరం: మండల గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులు ఏవీకే చైతన్య, యేసురాణి ఆధ్వర్యంలో చెత్త చెదారాన్ని తొలగించి, మరుగుదొడ్లను శుభ్రపర్చారు. ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, సూపర్వైజర్ కె.సుధాకర్, హెచ్ఏ పి.నందీష్, వెంకటరావు పాల్గొన్నారు.

- సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణను అధ్యాపకులు, విద్యార్థులు శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు
- చినకొండేపూడిలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రంగంపేట: మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కార్యాలయాల గదులు శుభ్రపరచడం, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో చెత్తా చెదారం తొలగించడం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పెదపూడి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెదపూడిలో వివిధ శాఖల అధికారులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఏఓ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



సీతానగరం జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లను శనివారం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై డి.రామ్ కుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 1,505 మంది ఓటర్లు ఉన్నారని, వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడి గాలి, వెలుతురు, విద్యుత్, అలాగే తాగునీటి సదుపాయాలు వంటి పలు సదుపాయాలపై పరిశీలించారు. అనంతరం వంగలపూడి రేవుకు చేరుకుని పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి వెళ్లే నడక మార్గాన్ని పరిశీలించారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కాళ్ల శ్రీను తదితరులు

బిక్కవోలు: ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. ఆ పాఠశాల శనివారం వద్ద నిర్వహించిన సమావేశంలో దొంతమూరుకు చెందిన శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరంలో చదువు, క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రోత్సాహక పతకాలు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కాళ్ల శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి వ్యక్తిత్వం అలవర్చుకోవాలన్నారు.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తకు ప్రశంసాపత్రం



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న నరసింహారావు

రాజానగరం: జాతీయ స్థాయి శిక్షణలో చురుకైన పాత్ర వహించినందుకు దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావుకు ప్రశంసా పత్రం లభించింది. జాతీయ వ్యవసాయ కీటక వనరుల సంస్థ (ఎన్‌బీఏఐఆర్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కొబ్బరి పంటలో ఆశించే చీడపురుగుల నివారణకు ఉపయుక్తమయ్యే జీవనియంత్రణ చర్యలపై బెంగళూరులో ఐదురోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలతో జరిగిన చర్చలలో నరసింహారావు చురుకుగా వ్యవహరించారు. రైతులు సాగులో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కార దిశగా చర్చించినందుకుగాను ఎన్‌బీఏఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ సుశీల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లాను పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు అభినందించారు.

కొండెక్కిన ఎన్నికల కోడ్

- సీఎం, ఎమ్మెల్యే ఫొటోలున్న ఫ్లెక్సీలతో ర్యాలీలు
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సందర్భంగా ప్రదర్శనలు



మిర్తిపాడులో సీఎం, ఎమ్మెల్యేల ఫొటోలున్న ఫ్లెక్సీతో జరుగుతున్న ర్యాలీ

సీతానగరం: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉంది. దాన్ని విద్యావంతులే తుంగలో తొక్కేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ర్యాలీలు చేశారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చింది. ప్రతి సోమవారం మండలాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ రద్దు చేశారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో గ్రామాల్లోని విగ్రహాలకు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలకు ముసుగులు వేయడం, శిలాఫలకాలకు పేపర్లు అతికించడం వంటి పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మరి శనివారం జరిగిన ర్యాలీలకు ఎన్నికల కోడ్‌ను మినహాయింపు ఇచ్చారా అని మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీలు

బిక్కవోలు: అంగన్‌వాడీ కేంద్రాలను పోషక కేంద్రాలు గానే కాకుండా విద్యాకేంద్రాలుగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని, దానికోసమే పోషణ బీ, పడాయి బీ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఐసీడీఎస్ బిక్కవోలు, ఊలపల్లి సెక్టార్ సూపర్ వైజర్లు కృష్ణకుమారి, శాంతిరత్న కుమారి అన్నారు. శనివారం బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తయ్యింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల పోషణ, ఎదుగుదల విషయంలో అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో పోషన్ బీ, పడాయి బీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఐసీడీఎస్ సీడీపీవో జె.ఝాన్సీ ఆధ్వర్యంలో ముగ్గళ్ల, సీతానగరం సెక్టార్లకు సంబంధించిన 48 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సూపర్వైజర్లు కె.పెదలక్ష్మి, ఎం.వరలక్ష్మి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవజాతి శిశువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్‌వాడీలో అందించే సేవలు, పిల్లలకు అందించే అనుబంధ ఆహారంపై వివరించారు.

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలకు మండలంలోని రాజానగరం ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్ దుర్గామణి, పాతతుంగపాడులో ఎస్. భూదేవి ఆధ్వర్యంలో 98 మంది కార్యకర్తలు శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'పోషణ్ బీ, పడాయి బీ' అమలులో భాగంగా ఆరేళ్ల లోపు పిల్లల ఎదుగుదల, శరీరక చలన, కండరాల అభివృద్ధితో పాటు మాట్లాడే విధానం (భాషాభివృద్ధి), వస్తువులను లెక్కించడం (గణితాభివృద్ధి), సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకత మున్నగు వాటి పై కార్యకర్తలకు అవగాహన కలిగించారు. శిక్షణ అనంతరం కార్యచరణపై కార్యకర్తలచే ప్రతిజ్ఞ చేయించారు.

మధురపూడి: గర్భిణలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరుకొండ సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. శనివారం కోరుకొండ, దోసకాయలపల్లి హైస్కూళ్లలో పోషణ బీ, పడాయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో ఝాన్సీరాణి మాట్లాడుతూ రేపటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అందరం సిద్ధం కావాలన్నారు.

మార్చి 23న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక



బ్రోచర్ విడుదల చేస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు

రాజానగరం: పి.గన్నవరంలో మార్చి 23న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక జరుగనుంది. ఈ కార్యక్రమానికి బ్రోచర్‌ను ఆ సంఘ నాయకులు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శనివారం రాజానగరంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల బాబీ, కార్యదర్శి పాపారావు, ఉపాధ్యక్షులు గ్రంధి నానబ్బులు, ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక గ్రంధి గణేష్ గుప్తా, కన్వీనర్ వారణాశి గుప్తా పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి, వాణి దంత వైద్యశాల, నీరజ డయాబెటిస్ సెంటర్ సహకారంతో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు మధుమేహం, రక్తపోటు, దంతాలు, కంటి పరీక్షలు చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్లు శ్రీవాణి, మనోహర్, డి.కవిత, ప్రనూష వైద్య సేవలందించారు.

అంగన్‌వాడీ వర్కర్లకు ముగిసిన శిక్షణ

రంగంపేట: అంగన్‌వాడీ వర్కర్లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ జె.జెస్సీఫ్లోరెన్స్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోషణ్ బీ, పడాయి బీ పేరిట కొత్త పథకాన్ని ప్రారంభించిందన్నారు. దానిపై రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. అనుబంధ పోషకాహారం, సంరక్షణ, విద్య, అంగన్‌వాడీ పర్యావరణ వ్యవస్థ, పిల్లల భవిష్యత్తు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఏపీఆర్‌సీఎస్ సభ్యులు

రంగంపేట: ప్రతి ఒక్కరూ దాతృత్వాన్ని అలవర్చుకోవాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. సింగంపల్లిలోని సీపీ రెడ్డి నగర్‌లో షేక్ నాగూర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె రాంబాబుతో కలిసి ఆంజనేయులు పరామర్శించారు. నాగూర్ భార్య మున్నీ, పిల్లలు సలీం, రియాన్‌లను కలసి 50 కేజీల బియ్యం, కొంత ఆర్థిక సాయం అందించారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

సీతానగరం: పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జాతీయ ప్రచురణ విభాగ ప్రతినిధి హాఫీజ్ సయ్యద్ రసూల్ నియాజ్ అన్నారు. వంగలపూడిలోని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మసీదులో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధార్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ పఠించాలని సూచించారు. పుస్తక పఠనంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే సామాజిక సమస్యలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా ఇన్‌చార్జి మహ్మద్ సిరాజ్ సాహెబ్, మసీదు అధ్యక్షుడు షేక్ ఖాసీం ఫరూక్ సాహెబ్, కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీల ఏర్పాటు

మధురపూడి: భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో భాగంగా మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏపీఆర్ చౌదరి అన్నారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనాదక్షతకు ఢిల్లీ పీఠాన్నిచ్చిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలోని మూడు మండలాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. కోరుకొండ మండలధ్యక్షుడిగా అడపా సుధీర్‌కుమార్, సీతానగరానికి వెంకటలక్ష్మి, రాజానగరానికి శివను నియమించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బిక్కి నాగేంద్ర, రాజానగరం నియోజకవర్గం కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో మానసిక ఆరోగ్యంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు, వృద్ధులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన కలిగించడం ట్రస్ట్ ఉద్దేశమని కోఆర్డినేటర్ పి.సుధాకర్ తెలిపారు. శిక్షణకు సంబంధించిన కిట్లను వీసీ ఇన్‌చార్జ్ ఆచార్య వై.శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.